క్లుప్తంగా

సన్మానం



నర్సంపేట : చెన్నారావుపేట తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా దిలావర్ మహ్మద్ అబిద్ అలీని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బోడ మురళి నాయక్, సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి రాము శుక్రవారం సన్మానించారు. తొలుత ఆయనకు పూల బొకే అందజేసి అభినందనలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవాభావంతో విధులు నిర్వర్తించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



దుగ్గొండి : మండలంలోని బిక్కాజిపల్లికి చెందిన గుండెకారి మలహల్‌రావుకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మేర్గు కట్టమల్లు, మండల నాయకుడు బండారి రమేశ్ శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం కట్టమల్లు, రమేశ్ మాట్లాడారు. పేదలు సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నల్ల రవి, బండారి ప్రకాశ్, ఇజ్జగిరి ముత్తయ్య, మాడిశెట్టి మహేశ్, నల్ల రాధాకిషన్, తదితరులు పాల్గొన్నారు.

'కేజీబీవీ' పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

దుగ్గొండి : మండలంలోని కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు బోధించడానికి బోధించడానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ మంజుల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ (ఇంగ్లిష్) సీఆర్‌టీ, ఎంఎల్‌టీ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. అర్హులు ఈనెల 14 నుంచి 18 వరకు విద్యాలయానికి వచ్చి దరఖాస్తు చేయాలని కోరారు.

ఆర్థికసాయం



గీసుకొండ : మండలంలోని మనుగొండకు చెందిన మూగల సమ్మయ్య, చాపర్తి శ్రావన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, ప్రముఖ సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి శుక్రవారం రూ.10 వేల చొప్పున సాయం అందజేశారు. ఆయన సమకూర్చిన నగదును స్థానిక నాయకులు అల్లం మర్రెడ్డి, వీరగోని రాజ్‌కుమార్, రడం భరత్ బాధిత కుటుంబాలకు అందించి మాట్లాడారు. పేద కుటుంబాలకు బాలకిశోర్‌రెడ్డి అండగా ఉంటాడని తెలిపారు.

పరామర్శ



గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పసుల పరశురాములు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆయన్ను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శక్రవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు చల్లా వేణుగోపాల్‌రెడ్డి, పూండ్రు జయపాల్‌రెడ్డి, పసుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి



నర్సంపేట : పట్టణంలోని ఎనిమిదో వార్డుకు చెందిన మున్నూరుకాపు సంఘం పట్టణ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వేల్పుల సాంబయ్య శుక్రవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజేందర్, మాజీ వైస్ ఎంపీపీ సాంబరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో నేడు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ప్రణీత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

పంట చేలల్లో మృత్యు ఘంటికలు

- చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు
- సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం

సంగెం : మండలంలో సుమారు 25–30 ఏళ్ల క్రితం వేసిన విద్యుత్ స్తంభాలు పంట చేలల్లో మృత్యు ఘంటికలు మోగిస్తున్నాయి. పలు గ్రామాల్లో వంగిన విద్యుత్ స్తంభాలు, ఇతర కారణాలతో చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతూ బెంబేలెత్తిస్తున్న పరిస్థితి నెలకొంది. పత్తి అచ్చు తోలేటప్పుడు ఇనుముతో చేసిన మొద్దును భుజాన వేసుకుని వెళ్లే క్రమంలో ఆదమరిస్తే లూజ్‌లైన్లు తాకి ప్రాణాపాయం ఖాయం.

మండలంలోని తిమ్మాపూర్, గాంధీనగర్, సంగెం, ఎల్గూర్ రంగంపేట తదితర గ్రామాల్లోని పంట పొలాల్లో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు ఒరిగి తీగలు వేలాడుతున్నాయి. పంటల సాగు వేళల్లో ఇనుముతో చేసినవి అయిన గుంటుక, గొర్రు సైతం భుజాన మోసుకెళ్లడం పరిపాటి. వేసవిలో దుక్కులు దున్నేటప్పుడు ట్రాక్టర్లకు విద్యుత్ తీగలు తగులుతుండడంతో రైతులు విద్యుత్ సరఫరా నిలిపేసి దుక్కులు దున్నించాల్సిన దుస్థితి నెలకొంది. సమస్యను పలుమార్లు విద్యుత్ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో రైతులే విద్యుత్ సరఫరా నిలిపేసి దుక్కులు దున్నించడం మండలంలో పరిపాటిగా పరిణమించింది. విద్యుత్ శాఖ అధికారులు సమస్య పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ రైతులు, మండల ప్రజలు విమర్శిస్తున్నారు. మనుషులకు, పశువులకు ప్రాణాపాయం తలెత్తితే అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరిస్తున్నారు.



గాంధీనగర్‌లో లూజ్ లైన్లను చూపుతున్న రైతు



విద్యుదాఘాతంతో మృతి చెందిన దుక్కిటెద్దు (ఫైల్)

అధికారుల నిర్లక్ష్యానికి దుక్కిటెద్దు బలి

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి మండలంలోని గాంధీనగర్‌లో రైతు పొన్నర్సు చంద్రశేఖర్‌కు చెందిన రూ.70 వేల విలువైన దుక్కిటెద్దు ప్రాణాలు కోల్పోయింది. పత్తి అచ్చు తోలుతుండగా తెగిపిన విద్యుత్ తీగ తగిలి దుక్కిటెద్దు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. మండలంలో ఇలాంటి ఘటనలు అనేక చోట్ల చేసుకున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 60 మీటర్లకు ఒకటి చొప్పున విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాల్సి ఉండగా అధికారులు పలు చోట్ల సుమారు 90 మీటర్లకు ఒకటి చొప్పున వేశారు. అలాగే తీగలు దశాబ్దాల క్రితం వేసిన కావడంతో లూజ్‌గా మారాయి. కొన్ని చోట్ల తీగలు గాలికి ఒకదానికి మరొకటి తగిలి కరిగిపోయి రెండు వరుసలతో ప్రమాదకరంగా ఉన్నా అధికారులు చర్యలకు ఉపక్రమించకపోవడం గమనార్హం. ఇకనైనా ప్రభుత్వం, ఎమ్మెల్యే, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. అలాగే విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు వాస్తవ పరిస్థితులపై పటిష్ట విచారణ చేపట్టి బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుని చిత్తశుద్ధి చాటాలని డిమాండ్ చేస్తున్నారు.

లూజ్‌లైన్లతో ఇబ్బంది

విద్యుత్ స్తంభాల లైన్లు లూజ్ కావడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. లైన్ల కింద దుక్కి దున్నినా, గుంటుక, గొర్రు కొట్టినా ప్రాణభయం ఉంది. చేతికి అందె ఎత్తులో ఉన్న తీగలు చేళల్లో మొక్కజొన్న వేస్తే కర్రలకు తగులుతున్నాయి. నీరు పెట్టే సమయంలోనూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నాం.

– రావిపాటి నాగేశ్వర్‌రావు, రైతు, గాంధీనగర్

లూజ్ లైన్లు సరి చేస్తున్నాం

లూజ్‌గా ఉన్న లైన్లను మధ్య స్తంభాలు వేసి సరి చేస్తున్నాం. ఇటీవలే లూజ్ లైన్లు కొన్ని సరి చేశాం. మిగితావి కూడా సరి చేస్తాం. కొందరు రైతులు పత్తి విత్తనాలు నాటారు. సదరు ప్రదేశాల్లో విద్యుత్ స్తంభాలు ఇప్పుడే వేయడం వీలు కాదు. రైతులు సహకరిస్తే ఆ ప్రదేశాల్లోనూ స్తంభాలు వేసి సమస్య పరిష్కరిస్తాం.

– మధుసూదన్, ఏఈ, విద్యుత్ శాఖ

ప్రభుత్వ స్కూళ్లలోనే ఉత్తమ విద్యాబోధన



వర్ధన్నపేట : మాట్లాడుతున్న హెచ్‌ఎం విజయ



పర్వతగిరి : బడిబాటలో టీచర్లు, తదితరులు

- జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం విజయ

వర్ధన్నపేట : ప్రభుత్వ స్కూళ్లలోనే ఉత్తమ విద్యాబోధన అందుతోందని ఇల్లంద జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు (హెచ్‌ఎం) విజయ తెలిపారు. మండలంలోని ఆ గ్రామంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు గ్రామస్తులను కలిసి పిల్లల చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో లభిస్తున్న సదుపాయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో సరైన అర్హత లేని ఉపాధ్యాయులు సైతం బోధిస్తుండగా ప్రభుత్వ స్కూళ్లలో అత్యున్నత విద్యార్హతలు, దశాబ్దాల అనుభవం కలిగిన ఉపాధ్యాయులు అంకిత భావంతో విద్యార్థుల ఉన్నతికి బంగారు బాటలు వేసేలా తరగతులు బోధిస్తున్నారని తెలిపారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం తదితరాలు అందిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు క్రియాశీలకంగా, బాధ్యతాయుతంగా పని చేస్తున్నారని వివరించారు. పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించి స్కూళ్ల బలోపేతానికి సహకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతోపాటు కాంగ్రెస్ నాయకులు పోశాల వెంకన్న, మోడెం కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని రోళ్లకల్‌లో ఉపాధ్యాయులు, సేవాలా యూత్ సభ్యులు బడిబాట నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో సేవాలాల్ యూత్ సలహాదారు బాలకృష్ణ, వెంకన్న, రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నల్లబెల్లి : అక్షరాభ్యాసం చేయిస్తున్న మమత



నర్సంపేట : నందిగామలో..

సామూహిక అక్షరాభ్యాసం

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని లింగగిరిలోని ప్రాథమికోన్నత స్కూల్ ఆవరణలో హెచ్‌ఎం పడిదం కట్టస్వామి, ఉపాధ్యాయులు చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు జయశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు సాంబలక్ష్మి, పూలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో..

నల్లబెల్లి : మండలంలోని నందిగామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మదర్ తెరెస్సా మండల సమాఖ్య అధ్యక్షురాలు జంగిలి మమత అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్యాప్రమాణాలు పాటించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్ పంపిణీ చేశారు.

ఒడిషాలో మండల యువకుడి మృతి



అనిల్ (ఫైల్)

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందకు చెందిన యువకుడు బొంతల అనిల్‌కుమార్ (32) ఒడిషాలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలిలా.. ఇల్లందకు చెందిన అనిల్‌కుమార్ ఒరిస్సాలోని కాలాహండి జిల్లా రాంపూర్ మండలం కదేల్ గ్రామ పరిధిలోని ఓ మైనింగ్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన గురువారం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. కంపెనీ ప్రతినిధులు సమాచారం అందించడంతో అనిల్‌కుమార్ బంధువులు హుటాహుటిన ఒడిశా వెళ్లారు. మృతదేహం శనివారం తెల్లవారే సమయానికి గ్రామానికి చేరుకుంటుందని తెలిసింది. అనిల్‌కుమార్ మృతితో ఇల్లందలో విషాదం నెలకొంది.

లారీ ఢీకొని రైతు..

పర్వతగిరి : లారీ ఢీకొని రైతు మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని మోత్యతండాకు చెందిన బాదావత్ రాములు (42) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన శుక్రవారం రావూరు మీదుగా ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై బోగం ప్రవీణ్ ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

108లో ప్రసవం

గూడూరు : మండలంలోని గుండెంగ శివారు నల్లబోడుతండాకు చెందిన బానోతు ఐశ్వర్య పురిటినొప్పులతో బాధపడుతుంది. గురువారం రాత్రి కుటుంబ సభ్యులు 108లో గూడూరు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. అప్రమత్తమైన అంబులెన్స్ ఎమర్జెన్సీ టెక్నీషియన్ బక్కి లలిత ఆమె సాధారణ ప్రసవం చేసింది. ఐశ్వర్య బాబుకు జన్మనిచ్చింది.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న సత్యనారాయణ, నాయకులు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ

వర్ధన్నపేట : కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు తప్పకుండా మంజూరు చేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ తెలిపారు. మండలంలోని ఇల్లందలో పలువురు లబ్ధిదారులకు శుక్రవారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రతాలు అందజేసి మాట్లాడారు. ఎమ్మెల్యే నాగరాజు సహకారంతో మండలంలోని పేదలందరికీ దశలవారీగా ఇళ్లు మంజూరు చేయిస్తామని చెప్పారు. అనంతరం గ్రామంలో పలువురి ఇళ్ల నిర్మాణాలకు ఆయన ముగ్గు పోశారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు పోశాల వెంకన్న గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గద్దం సమ్మయ్య, దుపెల్లి ఏలియా, గుంటి కుమారస్వామి, మైదం బుచ్చిమల్లు, తదితరులు పాల్గొన్నారు.

లాభసాటి వ్యవసాయానికి ఉద్యమించాలి

- రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్

దుగ్గొండి : రైతులు లాభసాటి వ్యవసాయం కోసం పాలకులపై ఉద్యమించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ కోరారు. వ్యవసాయం, రైతుల హక్కులపై రూపొందించిన షార్ట్ ఫిలింను మండలంలోని పొనకల్‌లో శుక్రవారం సాయంత్రం ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. రైతులకు ప్రోత్సహకాలు అందించడానికి భిన్నంగా భారాలు మోపడానికి ప్రాధాన్యత ఇస్తున్నాయని చెప్పారు. జీలుగ విత్తనాల బస్తాను ఏడాదిలో రెట్టింపు చేయడాన్ని ఉదహరించారు. పాలకుల మోసపూరిత విధానాలతో వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వెలిబుచ్చారు. ఫలితంగా వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు మూతపడి అనేక మంది నిరాశ్రయులుగా మారుతున్న దుస్థితి నెలకొందని చెప్పారు. లాభసాటి వ్యవసాయ పద్ధతులు ప్రవేశపెట్టేలా, రైతులను సబ్సిడీలతో ప్రోత్సహించేలా ఐక్యపోరాటాలు నిర్మించాలని సూచించారు. ఆ దిశగా రైతులను, ప్రజలను చైతన్యవంతం చేయాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, మండల అధ్యక్షుడు లడె మోహన్‌రావు, నాయకులు గుండెకారి రాజేశ్వర్‌రావు, మోర్తాల రవీందర్, బుస్సారి బాబురావు, శిరూరి రాజేశ్వర్‌రావు, కిటికె సంజీవరావు, వాడికారి బాపురావు, తదితరులు పాల్గొన్నారు.

'సర్వేతో తగాదాల పరిష్కారం'

ఖిలా వరంగల్: సర్వేతో భూ తగాదాలు పరిష్కారమవుతాయని కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టం అమలులో భాగంగా శుక్రవారం ఖిలా వరంగల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రభుత్వ సర్వేయర్స్ కోఆర్డినేటర్ ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో జూనియర్ సర్వేయర్లతో ఫీల్డ్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ తీసుకున్న సర్వేయర్లు సేవా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నరేష్, భోగి సురేష్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సుగుట్ట మెడికేర్ జనరల్ ఆస్పత్రిలో గుడ్ సామరిటన్ క్లబ్, ఈఐబీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేడు మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ చైర్మన్ గాదె స్వరూప్‌రెడ్డి తెలిపారు. రక్తదాత దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న శిబిరంలో ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల ఓనర్లు, డ్రైవర్లు, క్లీనర్లు, విద్యార్థులు పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్ : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏబీవీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని కోరారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని సూచించారు. సమావేశంలో ఏబీఎస్ఎఫ్ నాయకులు కిరణ్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

మామునూరు : బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుంచి 150 యూనిట్ల రక్తాన్ని రెడ్‌క్రాస్ వైద్యులు సేకరించారు. కార్యక్రమంలో వాగ్దేవి విద్యాసంస్థల డైరెక్టర్ చందుపట్ల వాణిదేవి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కమల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

- పీహెచ్‌సీ వైద్యాధికారి జ్యోతి

నల్లబెల్లి : సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని మేడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర (పీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ జ్యోతి కోరారు. మండలంలోని గొల్లపల్లిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం సందర్భంగా ఆమె మాట్లాడారు. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని చెప్పారు. ఇళ్ల ఆవరణల్లోని నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించాలని, ఏమాత్రం అనారోగ్యంగా ఉన్నా వెంటనే పీహెచ్‌సీకి వచ్చి వైద్యం చేయించుకోవాలని చెప్పారు. జ్వర పీడితులకు అవసరమైన పలు రకాల వైద్యపరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, తదితర సూచనలు చేశారు. తొలుత పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ జ్వర పీడితులను కలిసి వైద్యసేవలు అందించారు. ఇళ్ల ఆవరణల్లో ఉన్న నీటి నిల్వలను సిబ్బందితో కలిసి తొలగింపజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజు, హెల్త్ అసిస్టెంట్లు కనకలక్ష్మి, రవి, ఏఎన్ఎం సరిత, తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ జ్యోతి

చిన్నారులను 'అంగన్‌వాడీ'లకు పంపించాలి



నర్సంపేట: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పారిజాతం



హర్యాతండాలో ర్యాలీలో టీచర్ స్వరూప, తదితరులు

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పారిజాతం

నర్సంపేట : ఐదేళ్లలోపు వయస్సున్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పారిజాతం కోరారు. చెన్నారావుపేట మండలంలోని లింగగిరి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన 'అమ్మ మాట–అంగన్‌వాడీ బాట' కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తోందని చెప్పారు. చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పూలమ్మ, సాంబలక్ష్మి, ఆయా పద్మ, ప్రైమరీ స్కూల్ టీచర్ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హర్యాతండాలో..

అక్కల్‌చెడ శివారులోని హర్యాతండాలో నిర్వహించిన ర్యాలీలో అంగన్‌వాడీ టీచర్ కూనమల్ల స్వరూప మాట్లాడారు. అంగన్‌వాడీ సేవలపై గర్భిణులు, బాలింతలు, తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ భానోతు వీరన్న, అంగన్‌వాడీ ఆయా ఆగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'భూభారతి'తో సమస్యల పరిష్కారం

- తహసీల్దార్ కృష్ణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ కృష్ణ

నల్లబెల్లి : భూభారతి చట్టంతో భూసంబంధిత సమస్యలు పరిష్కారం కానున్నాయని తహసీల్దార్ ముప్పు కృష్ణ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరై పలువురు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు మినహా మిగతా అన్ని సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామని తెలిపారు. సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బత్తిని మహేశ్ మాట్లాడారు. భూసమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించే లక్ష్యంతో ప్రభుత్వం భూభారతి చట్టం, పోర్టల్ తీసుకొచ్చిందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ నిర్వహించిన సదస్సుల్లో అందుతున్న అన్ని దరఖాస్తులను నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించడానికి అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. సదస్సులో ఆర్ఐ కార్తీక్, పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్, కాంగ్రెస్ నాయకులు కొండి అశోక్, పాడేటి కిశోర్, కన్నెబోయిన సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్ల మార్పు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డివిజన్ విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లు మారాయి. గతంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ నంబర్ల స్థానంలో తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ యాజమాన్యం ఎయిర్‌టెల్ ఫోన్ నంబర్లు కేటాయించింది.

ఎన్పీడీసీఎల్ వరంగల్ సర్కిల్

అధికారి హోదా	ఫోన్ నంబర్	అధికారి హోదా	ఫోన్ నంబర్
ఎస్ఈ	87124 84950,	ఆజంజాహి మిల్స్ ఫ్యూజ్ ఆఫ్ కాల్	87124 85022
వరంగల్ టౌన్ డీఈ	87124 85067	గొర్రెకుంట సబ్‌స్టేషన్	87124 85035
వరంగల్ ఏడీఈ	87124 85048	ఫోర్ట్ రోడ్డు ఫ్యూజ్ ఆఫ్ కాల్	87124 85023
ములుగు రోడ్డు ఏడీఈ	87124 84977	గొర్రెకుంట ఫ్యూజ్ ఆఫ్ కాల్	87124 85030
శంభునిపేట ఏడీఈ	87124 85018	మట్వాడ సెక్షన్ ఆఫీస్ ఫ్యూజ్ ఆఫ్ కాల్	87124 84965
ఆజంజాహి మిల్ ఈఆర్ఓ ఏఏఈ	87124 85051	ఆరెపల్లి సబ్‌స్టేషన్	87124 84940
వరంగల్ ఈఆర్ఓ ఏఏఓ	87124 85052	ఆరెపల్లి సెక్షన్ కార్యాలయం ఫ్యూజ్ ఆఫ్ కాల్	87124 84936
వరంగల్ టౌన్ డివిజన్ కార్యాలయం ఏఈ టెక్	87124 85068	ఏనుమాముల సబ్‌స్టేషన్	87124 84941
వరంగల్ టౌన్ డివిజన్ కార్యాలయం ఏఈ కమర్షియల్	87124 85056	పోచమ్మ మైదాన్ సబ్ స్టేషన్	87124 84972
స్టేషన్ రోడ్డు ఏఈ	87124 85036	పోచమ్మ మైదాన్ సెక్షన్ ఆఫీస్ ఫ్యూజ్ ఆఫ్ కాల్	87124 84976
ఆజంజాహి మిల్స్ ఏఈ	87124 85020	దేశాయి సబ్ స్టేషన్	87124 84954
ఫోర్టురోడ్డు ఏఈ	8712485028	దేశాయిపేట సెక్షన్ ఆఫీస్ ఫ్యూజ్ ఆఫ్ కాల్	87124 84945
గొర్రెకుంట ఏఈ	87124 85033	మామునూరు సబ్‌స్టేషన్	87124 85003
మట్వాడ ఏఈ	87124 84963	మామునూరు సెక్షన్ ఆఫీస్ ఫ్యూజ్ ఆఫ్ కాల్	87124 84997
ఆరెపల్లి ఏఈ	87124 84938	బొల్లికుంట సబ్‌స్టేషన్	87124 85002
పోచమ్మ మైదాన్ ఏఈ	87124 84976	శంభునిపేట సబ్‌స్టేషన్	87124 85867
దేశాయిపేట ఏఈ	87124 84945	శంభునిపేట సెక్షన్ ఆఫీస్ ఫ్యూజ్ ఆఫ్ కాల్	87124 85006
మామునూరు ఏఈ	87124 84998	కరీమాబాద్ సబ్‌స్టేషన్	87124 84990
శంభునిపేట ఏఈ	87124 85005	కరీమాబాద్ సెక్షన్ ఆఫీస్ ఫ్యూజ్ ఆఫ్ కాల్	87124 84980
కరీమాబాద్ ఏఈ	87124 84986		
స్టేషన్‌రోడ్డు సబ్ స్టేషన్	87124 85046		
స్టేషన్ రోడ్డు సెక్షన్ ఆఫీస్ ఫ్యూజ్ ఆఫ్ కాల్	87124 85037		
ఫోర్ట్ రోడ్డు సబ్‌స్టేషన్	87124 85029		